క్లుప్తంగా

ఆర్టీసీ పరిధిలో రెండు నూతన బస్సులు ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు నూతనంగా బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ బస్సులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. వీటిలో ఒకటి మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్‌కు కేటాయించినట్లు వివరించారు. వినుకొండ ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని తీవ్రంగా పెరిగిన ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ ఆధ్వర్యంలో సీఐ శోభన్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ బాటసారులు నడిచి వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్యతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వందనం, మల్లికార్జునరావు, మార్కు, కోటేష్ పాల్గొన్నారు.

28న శావల్యాపురం మండల సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లెక్కలు ఆమోదిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల, గ్రామస్థాయి అధికారులు అందరు పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ప్రారంభం



నాదెండ్ల: ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌కు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ఏవీ రమణ కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 57 పోలింగ్‌బూత్‌ల్లో బుధవారం వెరిఫికేషన్ సర్వే ప్రారంభమైంది. బీఎల్‌వోలు ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల జాబితాలోని వివరాలను నమోదు చేసుకున్నారు. మార్పులు, చేర్పులతో పాటూ పీడబ్ల్యూడీ, మరణాలు, వలస పోయిన వారి వివరాలతో పాటూ 18 ఏళ్లు పైబడిన వారిని నూతన ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఇంటి పేరు, అడ్రస్సు, సవరణలకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 18 వరకూ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందని, 2025 జనవరి 6 నాటికి స్పెషల్ సమ్మరీ రివిజన్ పూర్తి చేసి జాబితాను రూపొందించనున్నారు.

ఈ మార్గాల్లో ప్రయాణం కష్టమే

- కొండ్రముట్ల, బండ్లమోటు, దుర్గి, వినుకొండ, కారంపూడి రహదారి గుంతలమయం
- భయపడుతున్న వాహన చోదకులు





అధ్వానంగా ఉన్న కేబీడీ రహదారి

బొల్లాపల్లి: మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గుంతలమయం, రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారులు 103 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. వీటిలో కొండ్రముట్ల–బండ్లమోటు–దుర్గి 40 కిలోమీటర్లు, రేమిడిచర్ల– లాలిపురం 23 కిలోమీటర్లు, వినుకొండ– గుట్లపల్లి– రావులాపురం 41.5 కిలోమీటర్లు రహదారులు విస్తరించి ఉన్నాయి. ప్రధానంగా కొండ్రముట్ల– బండ్లమోటు–దుర్గి (కేబీడీ) రహదారి కొన్నేళ్ల నుంచి అస్తవ్యస్తంగా అధ్వానంగా తయారైంది. వాహనాలు, ప్రయాణీకులు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణం నరక యాతనంగా మారింది. రేమిడిచర్ల–లాలిపురం రహదారి అక్కడక్కడ గుంతలమయంతో వాహనచోదకులకు ఇబ్బందులు కలిగిస్తోంది. కేబీడీ రహదారి పరిధిలో రావులాపురం, గండిగనుమల గ్రామాల పరిధిలో రోడ్ల విస్తరణ లేకపోవడం, ఆ రహదారిని ఆక్రమించుకోవడంతో వాహనదారులు కొన్నిసమయాలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారులను విస్తరించాలని వారంతా అధికారులను కోరుతున్నారు. కొన్నేళ్లుగా ఆయా రహదారులు మెయింటినెన్స్‌లో భాగంగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. రాష్ట్ర రహదారి అయిన వినుకొండ– కారంపూడి పరిధిలో బొమ్మరాజుపల్లి నుంచి వెంకటరెడ్డిపురం వరకు అటవీ ప్రాంతం పరిధిలో గతంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదు. దీంతో పాటు ఈ ప్రాంతంలో రహదారి మోకాళ్ల లోతు గుంతలతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేబీడీ రహదారిలో సైతం గండిగనుమల పరిసర ప్రాంతంలో కొంతమేర అటవీ శాఖ, రోడ్డుకు ఇరువైపులా పొలం యజమానులు ఆమోదం లేక అప్పట్లో రహదారిని ఏర్పాటు పూర్తిస్థాయిలో జరగలేదు. అలాగే ఈ మార్గాల్లో వర్షాకాలంలో తీవ్ర మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికైనా ఆయా రహదారులను ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

కొన్నేళ్లుగా ఆర్‌అండ్‌బీ రహదారులకు మెయింటెనెన్స్ నిధులు మంజూరు కాలేదు. ఈ ఏడాది కొండ్రముట్ల–బండ్లమోటు – దుర్గి రహదారి ప్యాచ్‌వర్క్‌ల నిమిత్తం రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. అలాగే రేమిడిచర్ల–లాలిపురం రహదారి ప్యాచ్‌వర్క్‌కు రూ.6 లక్షలతో ప్రతిపాదనలు అందజేయడం జరిగింది. మంజూరై నిధులు కేటాయిస్తే పనులు మొదలు పెడతాం.

– కె.నవ్య, ఏఈ, ఆర్‌అండ్‌బీ

భారత్ బంద్ విజయవంతమైంది

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్



మున్సిపల్ హైస్కూలు నుంచి విద్యార్థులను బయటకు పంపుతున్న నాయకులు

నరసరావుపేట: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పున పరిశీలించాలని కోరుతూ నిర్వహించిన భారత్‌బంద్ జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో విజయవంతంగా జరిగిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్ పేర్కొన్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు నిలిపివేయించారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలను మూసేయించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.

దేశంలో దళిత గిరిజన వర్గాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తిరిగి వెనక్కి తీసుకుంటున్నదనే భావన ఈ బందు వల్ల అర్థమైందన్నారు. ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు ద్వారా వచ్చిన తీర్పు దేశంలోనే అంబేద్కర్ వాదులు, దళిత గిరిజన వర్గాల రిజర్వేషన్ల మూలాలను కదలించే ప్రక్రియ కేంద్ర ప్రభుత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకుందన్నారు. ప్రభుత్వాలు, న్యాయస్థానాలు దళిత గిరిజనులకు 2021 జనాభా లెక్కల ప్రకారం లెక్కలు వేసి రిజర్వేషన్లు పెంచే ఆలోచన చేయాలని కోరారు. డాక్టర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్స్ హక్కులను కాలరాయాలని చూస్తున్న ఏ ప్రభుత్వానికైనా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఉమ్మడి ప్రజల హక్కులు, రిజర్వేషన్ల జోలికి ఏ ప్రభుత్వాలు వచ్చినా ఆ రాజకీయ పార్టీల అంతం మాలల పంతం అవుతుందని, ఈ నినాదంతోనే ముందుకు వెళతామని హెచ్చరించారు. ఈ భారత బంద్‌లో పాల్గొన్న మాల సంఘాలు, బీఎస్పీ నాయకులు, సహకరించిన అన్నీ వర్గాల ప్రజలతో పాటు పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. బీఎస్పీ జిల్లా జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు, కూచిపూడి చంద్ర, ముసుగు రవి, వుస్తేల జయరావు, డేవిడ్, గోదాబాల, బోరుగడ్డ అంబేద్కర్, గురుస్వామి, సేవా సామేలు, జొన్నలగడ్డ వెంకటరావు, కొండ్రు ఆనంద్, నన్నం రాము, నీలాంబ్రం పాల్గొన్నారు. నరసరావుపేటలో బంద్‌ను విజయవంతం చేశామని పీవీ రావు కమిటీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తుళ్లూరు శివయ్య పేర్కొన్నారు.

చిలకలూరిపేటలో బంద్ పాక్షికం



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చిలకలూరిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా, పాక్షికంగా కొనసాగింది. తెల్లవారు జామున నాలుగు గంటలకే వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు చేరుకొని బస్సులు బయటకు రాకుండా నాయకులు అడ్డుకున్నారు. ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. పోలీసులు బస్‌స్టేషన్‌కు చేరుకొని ప్రయాణికుల ఇబ్బందులు గుర్తించి బస్సులను అనుమతించాలని సంఘ నాయకులతో చర్చలు జరపడంతో ఉదయం 9 గంటల నుంచి బస్సులను విడుదల చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను సంఘాల నాయకులు మూయించివేశారు. పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటుగా వెళుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు సంఘాల నాయకులు వినతి పత్రం అందజేసి వర్గీకరణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ అంశంపై గతంలో తోసిపుచ్చిన ఉన్నత న్యాయస్థానం తిరిగి అంశాన్ని వర్గీకరణ చేయాలని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. వర్గీకరణ అంశానికి బీజేపీ మద్దతుగా నిలవడం చూస్తూ ఉంటే కులాలా మధ్య చిచ్చుపెట్టి వివాదాలు రెచ్చగొట్టేందుకు కుట్ర పూరితమైన ఆలోచన చేస్తున్నట్లుగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై పునరాలోచన చేయాలని కోరారు. దీనిపై రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు, బీఎస్పీ, గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థి, యువకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలను సుందరంగా మారుస్తాం

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



రావిపాడురోడ్డు రెండో స్వర్గపురిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: నియోజకవర్గంలో శ్మశాన వాటికలను అభివృద్ధిచేసి సుందరవనాలుగా మారుస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. బుధవారం రావిపాడురోడ్డులోని రెండో స్వర్గపురిని సందర్శించారు. అక్కడ జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా మార్చి చూపించి తీరుతానన్నారు. గతంలో కోడెల శివప్రసాదరావు ఉన్నప్పుడు ఎంత సుందరంగా ఉండేదో అంతకు మించి శుభ్రంగా తయారు చేసి కోడెలకు అంకితం ఇస్తానన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అన్ని పార్టీల నాయకులు కూడా సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని చెప్పారు.

డాక్టర్‌ను హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వినుకొండ(నూజెండ్ల): కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్య ఘటనపై ప్రజా చైతన్య వేదిక, ఏఐసీసీటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి శివయ్య స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి హత్యచేసిన మృగాలను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కిసాన్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన శిక్షలు అమలు చేయాలని, అప్పుడు దేశంలోని మహిళలకు రక్షణ ఉంటుందని అన్నారు. పభుత్వ డాక్టర్ అబ్దుల్ రజాక్, తిరుమల హాస్పటల్, బాలాజీ హాస్పటల్, మాధవరావు హాస్పటల్ సిబ్బంది పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు విజయకుమార్, ఫిరోజ్, వెంకటేశ్వర్లు, దుర్గా ప్రసాద్, లింగాచారి, గోపి, ప్రసాద్, రవి, శిరీష, కోమలి, శేఖర్, సునీత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశవ్యాధి నివారణ పరీక్షలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

నాదెండ్ల: యడ్లపాడు మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలో గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి నరసరావుపేట డీడీ డాక్టర్ రామారావు, ఏడీ డాక్టర్ నర్సింహులు, చిలకలూరిపేట ఏడీ శ్రీనివాసరావు, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ రాధాకృష్ణ, రోజర్ బెన్ని, ఏడుకొండలు, దీప్తి, గ్రామ ఉపసర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు. గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించి ఎదకు రాని యాభై పశువులు, 15 తిరగపార్లే పశువులను గుర్తించి ఉచితంగా మందులు, దూడలు, గేదెలకు నట్టల నివారణ మందులు వేశారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ పశుపోషకులు గేదెలు ఈనిన తర్వాత 45 రోజుల నుంచి 90 రోజులలోపే గేదె ఎదకు వచ్చేలా యాజమాన్య పద్ధతులు పాటించాలని, ప్రతి ఏడాది ఒక దూడ పొందవచ్చని తెలిపారు. ఇలా చేయకుంటే పాడి రైతు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గేదెల్లో ఎద లక్షణాలు గుర్తించటం, సరైన సమయంలో చూడికట్టించటం తప్పనిసరిగా చేయాలన్నారు. పశుబీమా పథకంలో గురించి అవగాహన కల్పించారు.

పీర్ ఎడ్యూకేటర్స్ ఎన్నిక



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆరోగ్య సబ్ సెంటర్ ఆధ్వర్యంలో పీర్ ఎడ్యూకేటర్స్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికైన విద్యార్థులకు పీర్ ఎడ్యూకేటర్స్‌కు కోట్లు, టోపీలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులకు ఫ్లోరోసిస్, స్క్రీనింగ్, టెస్టులు నిర్వహించారు. పాఠశాలలోని బాల బాలికలకు టీడీ టీకాలు వేశారు. పిల్లల్లో రక్త హీనత నివారణపై అవగాహన కల్పించారు. పోషక పదార్థాలు ఉన్న ఆకు కూరలను ఎక్కువగా తినాలన్నారు. మంచి స్పర్శ, చెడు స్పర్శలపై వివరించారు. మధ్యాహ్న భోజనం ప్రాముఖ్యతను విపులీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, ఎంఎల్‌హెచ్‌పీ రూన్సీరాణి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మీ, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వలేటి శివకృష్ణ

శావల్యాపురం: ఈ ఖరీఫ్ సీజనులో అర్హత కల్గిన రైతులందరికీ సత్వరమే వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తున్నట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వలేటి శివకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మేనేజర్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.12 కోట్లు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. క్రాప్ రుణాలు రూ. 45 పైసల వడ్డీ రేటు, బంగారు ఆభరణాలపై రూ.77 పైసల వడ్డీ రేటుకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాల్లోని మహిళా గ్రూపులకు రూ.50 కోట్లు, వ్యవసాయ అనుబంధ రుణాలు రూ. 20 కోట్లు ఖాతాదారులకు రుణాలు రూపంలో అందజేశామన్నారు. రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు ప్రభుత్వ పరంగా వడ్డీరాయితీ వర్తిస్తుందన్నారు. రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు.

విద్యాభివృద్ధికి ఐకాన్‌గా కేంద్రియ విద్యాలయం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: ఒత్తిడి లేని నాణ్యమైన విద్య కేంద్రియ విద్యాలయంలో లభిస్తుందని, కేంద్రియ విద్యాలయం చిలకలూరిపేట నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఐకాన్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఇర్లపాడులో ప్రారంభానికి సిద్ధమైన కేంద్రియ విద్యాలయ భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. సుమారు ఆరేళ్ళ క్రితం ఈ పాఠశాల ఏర్పాటుకు అనుమతులు తీసుకొచ్చానని, సుమారు రూ.39 కోట్లతో పదెకరాల్లో బిల్డింగ్ నిర్మాణ పనులు తుదిదశకు చేరాయన్నారు. సుమారు 1200 మంది విద్యార్థులు ఇక్కడ ఇంటర్ వరకూ చదువుకునే అవకాశం ఉందన్నారు. ఈ పాఠశాలకు త్వరలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని, కనపర్రు, ఇతర గ్రామాలకు అప్రోచ్ రోడ్లు నిర్మిస్తామన్నారు. నరసరావుపేట రహదారి నుంచి పాఠశాల భవనాల వరకూ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. త్వరలో రోడ్డును పూర్తి చేసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనానికి ప్రాధాన్యత నిస్తామన్నారు. ఈ నెలాఖరు నాటికి భవనం పనులు పూర్తి చేసి సంబంధిత కాంట్రాక్టర్ పాఠశాల యాజమాన్యానికి అప్పగించాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో పాఠశాలను అధికారికంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటూ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అహమ్మద్ ఫరూక్, విజయ కుమార్, టీడీపీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, మదన్ మోహన్, సాయిబాబా, గుర్రం ఉపేంద్ర, రంగనాధుల నాగేశ్వరరావు, గట్టినేని రమేష్, విజ్జా సింగయ్య, గుర్రం నాగపూర్ణచంద్రరావు, కామినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పదవికి మమతా బెనర్జీ అనర్హురాలు

పల్నాడు బస్టాండ్‌లో సీపీఎం నాయకుల ధర్నా



పల్నాడు బస్టాండ్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

నరసరావుపేట: కలకత్తాలోని ఆర్‌జీకార్ మెడికల్ కళాశాల మహిళా ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య సంఘటనకు నిరసనగా బుధవారం పల్నాడు బస్టాండ్‌లో సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఒక మహిళ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో దేశంలోని సభ్యసమాజం సిగ్గుపడేలా ఈ ఉదంతం జరిగిందని పేర్కొన్నారు. మమతా బెనర్జీ సీఎం పదవికి అనర్హురాలని అన్నారు. వైద్యవృత్తిలో ఉన్న వారికే రక్షణ లేకపోతే ప్రజలను వారెలా కాపాడతారని ప్రశ్నించారు. డాక్టర్లకు పౌరసమాజం రక్షణగా నిలబడాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. ఏచూరి గోపాలరావు, డి.శివకుమారి, మహిళా నాయకులు మాట్లాడారు. యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలు పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య



కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య

నరసరావుపేట: వచ్చే నెల ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న రెవెన్యూ సదస్సులలో భూములకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న 15 రకాల భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని కోటప్పకొండ రోడ్డు పార్టీ కార్యాలయంలో బుధవారం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో చుక్కల భూములు, 22ఏ, అటవీ భూములు, అసైన్డ్ భూముల సమస్యలు ఎన్నో ఉన్నాయని, రెవెన్యూ సదస్సుల ఎజెండాలో ఆయా భూముల సమస్యలు చర్చించి పరిష్కరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని, ఇసుక ఉచితం అని ప్రకటించినప్పటికీ ధరలు ఏమాత్రం తగ్గలేదని, దీనిపై సమగ్రమైన విధానాన్ని అమలు చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగిస్తే తగులబెట్టాలని చెప్పిన మంత్రి లోకేష్ దీనిపై స్పష్టమైన వైఖరి ప్రకటించలేదన్నారు. ఒకవైపు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తామని చెబుతూనే మీటర్లు కూడా ఉంటాయని చెబుతున్నారని ఇది సరైన విధానం కాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు సిలిండర్లు, నూతన రేషన్ కార్డుల ప్రక్రియపై స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉందన్నారు. రాజధాని నిర్మాణం పై అడ్మినిస్ట్రేషన్ భవనాలు కట్టాలన్నా భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలన్నా రూ.1 లక్ష కోట్లు నిధులు అవసరం ఉంటుందన్నారు. ప్రత్యేక హోదా విభజన హామీలు వంటి కీలకమైన అంశాలను వదిలేసి ప్రపంచ బ్యాంకు తోక పట్టుకొని పోవటం వలన ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, రాయితీ రుణాలు, సీసీఆర్సీ కార్డులు ఉన్న కౌలు రైతులకు సైతం అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయలన్నారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ జలాశయంలో ఆశించిన మేర నీటి లబ్ధితో ఉన్న నేపథ్యంలో పలనాడు రైతులు వరి సాగుకు ఉపక్రమిస్తారని తెలిసి కూడా ప్రభుత్వం రైతులకు కావలసిన విత్తనాలను సరఫరా చేయడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. విత్తనాల కోసం బారులు తీరిన రైతులను పోలీసుల ద్వారా తరిమి కొట్టారని గుర్తు చేశారు. నాలుగుసార్లు శంకుస్థాపన చేసిన వరికపూడిసెల పనులు తక్షణమే మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ ముగుస్తున్నప్పటికీ కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు పూర్తిస్థాయిలో మంజూరు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కార్డు పొందిన రైతులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు మొండిచేయి చూపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయనాయక్, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, కె.హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

ముప్పాళ్ల జెడ్పీ పాఠశాలలో స్పెషల్ డ్రైవ్



ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ ఎస్.అక్బర్‌అలీ, జిల్లా సమన్వయకర్త కేఎం హుస్సేన్‌లు పాల్గొని బడి మానేసి, 16 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి మరలా చదువుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. దూరవిద్య ద్వారా పదవతరగతి, ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉందని, ఈ విధానం వలన కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. మధ్యలో చదువు మానేసిన వారికి మంచి అవకాశం దూరవిద్య ద్వారా ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ నెలాఖరులోపు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా దూరవిద్య కోర్సులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుంభా నాగేంద్రమ్మ, ప్రోగ్రామ్ అసిస్టెంట్ డీసీ చినరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూర విద్య ద్వారా టెన్త్, ఇంటర్ చదువుకునే అవకాశం

సార్వత్రిక విద్యా పీఠం రాష్ట్ర కో ఆర్డినేటర్ అక్బర్‌అలీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అక్బర్ అలీ

కారెంపూడి: బడి బయట ఉన్న 14, 15 ఏళ్లు పైబడిన వారు పదవ తరగతి, ఇంటర్‌ను సార్వత్రిక విద్యా పీఠం అందించే దూర విద్య ద్వారా అభ్యసించే అవకాశం ఉందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సార్వత్రిక విద్యా పీఠం రాష్ట్ర కో ఆర్డినేటర్ షేక్ అక్బర్ అలీ పేర్కొన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ఉన్న సార్వత్రిక విద్యా పీఠం సెంటర్‌లో ఆయన ఈ మేరకు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. 14 ఏళ్లు నిండిన వారు దూర విద్య ద్వారా పదవ తరగతి, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్మీడియట్ కోర్సులను అభ్యసించే అవకాశాన్ని సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోందని తెలిపారు. హెచ్ఎం అనంతశివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సెయింటాన్స్ విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు: ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో క్రోసూరు సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు కె.దీవెన ఏంజల్, కె.పూజిత, జి.తనూజ ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ మేరీ రజిత బుధవారం తెలియజేశారు. జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి, సిల్వర్ మెడల్, ట్రోఫీని సాధించుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందిస్తూ క్రీడలలో పాఠశాల తరఫున జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.